ప్రజాశక్తి

గురువారం 22 జూన్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

పోలవరం సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం నాయకులు వై.రాజు

'పోలవరం' పాదయాత్రకు మద్దతుగా పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం సీనియర్ నాయకులు వై.రాజు డిమాండ్‌చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలో పోలవరం పోరుకేక పేరుతో చేపట్టిన మహాపాదయాత్రకు మద్దతుగా పూర్ణా మార్కెట్ సమీపంలోని స్ప్రింగ్ రోడ్డులో సిపిఎం ఆధ్వర్యాన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వై.రాజు మాట్లాడుతూ, 60వ దశకం నుంచి పోలవరం సమస్య ఉందని, ఆనాటి నుంచి నేటి వరకూ ప్రాజెక్టు నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వారికి 2013 నాటి చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో 7 మండలాలను తెలంగాణ నుంచి ఎపిలోకి కలిపారన్నారు. భద్రాచలం దేవస్థానం మాత్రం తెలంగాణలో ఉంచారన్నారు. అన్యాయమైన విభజన జరిగిందన్నారు. ఈ మండలాల విభజన సమయంలో ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. అయినా కేంద్రాన్ని ప్రశ్నించే సత్తా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి లేదన్నారు. కేంద్ర ప్రభుత్వానికి తలొగ్గి రాష్ట్ర హక్కులను తాకట్టు పెట్టే దారుణమైన పరిస్థితి ఉందని విమర్శించారు. ఇటువంటి పరిస్థితుల్లో సిపిఎం మాత్రమే కేంద్రాన్ని ప్రశ్నించగలదన్నారు. సిపిఎం చేపట్టిన పాదయాత్రకు ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జగదాంబ జోన్ కన్వీనర్ ఎం.సుబ్బారావు, ముఠా కళాసీల నాయకులు రెడ్డి, పైడిరాజు, శ్రీను, రాము, సిఐటియు జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి చంద్రమౌళి, డివైఎఫ్ఐ నాయకులు సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

'కెజిబివి' పోస్టులకు ధ్రువపత్రాల పరిశీలన

- ఉపాధ్యాయులకు సకాలంలో ఇవ్వని సమాచారం
- ఆలస్యంగా ప్రారంభం
- ఎండలో అభ్యర్థుల అవస్థలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో కస్తూర్బా విద్యాలయాల్లో (కెజిబివి) బోధకుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న మెరిట్ అభ్యర్థుల ధ్రువపత్రాలను నగరంలోని సత్యం కూడలి దగ్గర శారదా విద్యాలయంలో సమగ్ర శిక్ష అధికారులు బుధవారం పరిశీలించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారికి మంచినీటి సౌకర్యం కల్పించలేదని అభ్యర్థులు వాపోయారు. ఉదయం 9 గంటలకు ధ్రువపత్రాల పరిశీలన కేంద్రానికి అభ్యర్థులు వచ్చారు. అయితే ధ్రువపత్రాల పరిశీలన మాత్రం ఉదయం 11.30 గంటల తరువాత ప్రారంభించడంతో ఎండలోనే ఉండాల్సివచ్చింది. ధ్రువపత్రాల పరిశీలనకు రావాల్సిన ప్రాధానోపాధ్యాయులకు ముందురోజు రాత్రి ఆలస్యంగా సమాచారం ఇవ్వడంతో వారు సకాలంలో రాలేకపోయారు. పాఠశాలలు తెరిచే నాటికి ఖాళీలను భర్తీచేస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ వారం రోజులు దాటుతున్నా నియామక ప్రక్రియ పూర్తికాలేదు. ఇంకా ధ్రువపత్రాల పరిశీలన స్థాయి దాటలేదు. అనేక కెజిబివిల్లో సబ్జెక్టు టీచర్లులేక తరగతులు అవ్వడంలేదు. ఉమ్మడి జిల్లాల్లోని 34 కెజిబివిల్లో సిఆర్‌టిలు, పిజిటిలు, ప్రిన్సిపాళ్లు తదితర 151 పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ జారీచేశారు. ఈ పోస్టులకు దాదాపు ఐదువేల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో పోస్టుకు రోస్టర్, మెరిట్ కింద ముగ్గురు అభ్యర్థులను చొప్పున 428 మందిని ఎంపికచేశారు. వీరిలో తొలిరోజు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన 186 మందిలో 158 మంది మౌఖిక పరీక్షలకు అర్హత సాధించారు. గురువారం మిగిలిన అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించనున్నారు.

గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : శ్రీవరాహలక్ష్మీనృసింహ స్వామి వార్షిక 'గిరి ప్రదక్షిణ' 'ఆషాఢ పౌర్ణమి' జులై 2, 3 తేదీలలో జరుగనున్న నేపథ్యంలో అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గిరి ప్రదక్షిణకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించేందుకు సింహాచల దేవస్థానం, జివిఎంసి, పోలీసు, ట్రాఫిక్, ఆర్టీసీ, అగ్నిమాపక, రెవెన్యూ వైద్యారోగ్య తదితర శాఖల అధికారులతో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జులై 2వ తేదీన భక్తులందరూ సింహగిరి చుట్టూ సుమారు 32 కిలోమీటర్ల దూరం గిరి ప్రదక్షిణ చేసి స్వామివారి కొండ దిగువ తొలి పావంచా చేరుకుంటారని తెలిపారు. గిరిప్రదక్షిణ రోజున సుమారు 70 వేల మంది భక్తులు, ఆషాఢ పౌర్ణమి రోజున లక్ష మందికి పైబడి స్వామివారి దర్శనానికి వచ్చే అవకాశం ఉందన్నారు. గిరి ప్రదక్షిణ సందర్భంగా దేవస్థానం

మిగతా 2లో..

ఖరగ్‌పూర్ డివిజన్‌లో రైళ్ళ రద్దు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఖరగ్‌పూర్ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా పలు రైళ్ళను రద్దు చేస్తున్నట్టు రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. ఈ నెల 22న 22603 ఖరగ్‌పూర్-విల్లుపురం ఎక్స్‌ప్రెస్, 18045 షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 18046 హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 22874 విశాఖపట్నం-దిఘా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 22851 సంత్రాగచ్చి-మంగుళూరు ఎక్స్‌ప్రెస్, 07047 దిబ్రూఘర్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌లను, ఈ నెల 23న 22873 దిఘా-విశాఖపట్నం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 22832 శ్రీ సత్య సాయి ప్రశాంతి నిలయం- హౌరా ఎక్స్‌ప్రెస్ లను రద్దు చేశారు.

ప్రజా సాహిత్యం రావాలి

వార్త 2లో..

శానిటేషన్ సెక్రటరీల సస్పెన్షన్ ఎత్తివేయాలి

వార్త 2లో..

'ముస్లిములకు పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలి'

వార్త 2లో..

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

యోగా చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జెసి విశ్వనాథన్, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ

తొమ్మిదవ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల వ్యాప్తంగా పలుచోట్ల నిర్వహించారు. ఈ సందర్భంగా వాడవాడలా యోగాపై అవగాహన కల్పించారు. యోగా ప్రాముఖ్యతను వివరించారు. యోగాసన పోటీల్లో విజేతలకు బహుమతులను అతిథులు అందించారు.

వార్తలు 3లో..

మొదటి పేజీ తరువాయి..

గిరి ప్రదక్షిణ ఏర్పాట్లుపై సమీక్ష

వారిచే కొండ చుట్టూ షామియానాలతో 25 స్టాల్స్ ఏర్పాటు చేసి, ప్రతి స్టాల్‌లో టేబుళ్లు, కుర్చీలు, వాటర్ డ్రమ్ములు, సౌండ్ సిస్టం, లైటింగ్, సైన్ బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అన్ని స్టాల్స్‌లో తగిన మందులతో మెడికల్ క్యాంపు, ఒక ఎఎన్ఎమ్, ఆశ కార్యకర్త షిఫ్ట్ పద్ధతిలో ఉండాలని, ప్రథమ చికిత్స కిట్స్ అందుబాటులో ఉంచాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. తగినన్ని అంబులెన్స్‌లు ప్రభుత్వ, ప్రైవేటు సహకారంతో అందుబాటులో ఉంచాలన్నారు. మొబైల్ టాయిలెట్లు , మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు. దేవాదాయ శాఖ, పోలీస్, రెవెన్యూ, జివిఎంసి, హెల్త్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ గిరిప్రదక్షిణకు పోలీసులతో పాటు ఎన్‌డిఆర్‌ఎఫ్, మెరైన్ పోలీసులు సేవలు అందిస్తారని తెలిపారు. పాత గోశాల, గోపాలపట్నం నుంచి వచ్చే వాహనాలకు పాత గోశాల తరువాత అనుమతి లేదని తెలిపారు. శొంఠ్యాం నుంచి వచ్చే వాహనాలకు అడవివరం వద్ద పార్కింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఇన్‌ఛార్జి ఇఒ భ్రమరాంబ మాట్లాడుతూ, ఈ ఏడాది జరిగే వార్షిక ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. దర్శనానంతరం భక్తులను ఉచితంగా కొండపైకి, కిందకు దించేందుకు దేవస్థానం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మ, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, దేవాదాయశాఖ సిబ్బంది, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిఐడి చీఫ్ సంజయ్ క్షమాపణ చెప్పాలి : అనిత

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : మహిళలను కించపరుస్తూ మాట్లాడిన సిఐడి చీఫ్ సంజయ్ తక్షణం మహిళలకు క్షమాపణ చెప్పాలని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షులు వంగలపూడి అనిత డిమాండ్ చేశారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో మహిళలపై దాడులు ఎన్నడూ లేనంత ఘోరంగా జరుగుతున్నాయన్నారు. దాడుల నేపథ్యంలో ఎపి సిఐడి చీఫ్ సంజయ్ మాటలు దారుణంగా ఉన్నాయన్నారు. అత్యాచారాల ఘటనను, మార్గదర్శి ఖాతాదారులతో పోల్చడం దారుణమని పేర్కొన్నారు. బాలిక కేక్, చాక్‌లెట్ కోసం లొంగి పోతుందని మాట్లాడం తగదన్నారు. ఇలాంటి అధికారులు ఉంటే ఎన్ని దాడులైనా జరుగుతాయన్నారు. సిఐడి చీఫ్ ఆడపిల్లలపై మాట్లాడితే ఎపి మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. సిఐడి చీఫ్ మాటలు వినిపించలేదా, కనిపించలేదా అన్నారు.

యువతకు సందేశం ఇచ్చే 'సామజవరగమన'

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : సామజవరగమన చిత్రం యువతకు సందేశం ఇచ్చేలా ఉంటుందని కథానాయకుడు శ్రీవిష్ణు తెలిపారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై ఎకె ఎంటర్‌టైన్మెంట్స్‌తో కలిసి రాజేష్ దండా నిర్మిస్తున్న సామజవరగమన చిత్ర యూనిట్ బుధవారం డాబాగార్డెన్స్‌లోని ఒక హోటల్‌లో మీడియా సమావేశంలో పాల్గొంది. ఈ సందర్భంగా కథానాయకుడు శ్రీవిష్ణు మాట్లాడుతూ, ఆహ్వాన యాత్రలో భాగంగా విశాఖ వచ్చామన్నారు. ఇది పూర్తి కుటుంబ కథా చిత్రమని, ఈ చిత్రం అన్ని తరగతుల ప్రేక్షకులను అలరిస్తుందని తెలిపారు. దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని చెప్పారు. ఈనెల 29న రెండు తెలుగు రాష్ట్రాలలో సినిమా విడుదల అవుతుందని తెలిపారు. డైరెక్టర్ రామ్ అబ్బరాజు, హీరోయిన్ రెబ్బ మోని, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపరచాలి : సిపిఎం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : దక్షిణ నియోజకవర్గంలోని 35వ వార్డులో పలు ప్రాంతాలలో పారిశుధ్యం పూర్తిగా క్షీణించిందని సిపిఎం జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు తెలిపారు. గాజుల వీధి, పండా వీధి, కల్లుపాకల, ప్రసాద్ గార్డెన్స్ ప్రాంతాలలో పారిశుధ్యం బాగోలేదన్నారు. దీనిపై పలుమార్లు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు సిపిఎం తరుపున ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా మార్పు రాలేదన్నారు. ఇప్పటికైనా జివిఎంసి అధికారులు దృష్టి సారించి 35వ వార్డులో పారిశుధ్యం మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.

రొమ్ము కేన్సర్‌పై అప్రమత్తం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : రొమ్ము కేన్సర్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లయన్స్ కేన్సర్, జనరల్ ఆసుపత్రి నిర్వాహకులు ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు అన్నారు. రూ.2 లక్షల విలువ చేసే రొమ్ము కేన్సర్ చికిత్స పరికరాలను బుధవారం కెజిహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పాండురంగ కుమారికి లయన్స్ కేన్సర్ ఆసుపత్రి తరుపున విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కెజిహెచ్‌లోని రేడియో థెరపీ విభాగధిపతి డాక్టర్ ఎవై.రావు లయన్స్ కేన్సర్ ఆసుపత్రికి చేసిన విజ్ఞాపన మేరకు ఈ పరికరాలు అందజేశామన్నారు. డాక్టర్ రావు మాట్లాడుతూ, ఆచార్య ఉమామహేశ్వరరావు చొరవ, ప్రోత్సాహం ప్రశంసనీయం అన్నారు.

ప్రజా సాహిత్యం రావాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రజా సమస్యలను వివరిస్తూ, వాటికి పరిష్కారాలను చెబుతూ, ప్రజా పాటలు, ప్రజా సాహిత్యం విరివిగా రావలసిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారుడు, ప్రజా గాయకుడు పందిరి రాము రచించిన 'ప్రజా పాటల పందిరి' పాటల పుస్తకాన్ని జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కార్యదర్శి ఎ.అజశర్మ, సావిత్రిబాయి పూలే ట్రస్ట్ ఛైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, పాటల రచయిత బి.ఎ.నారాయణరావు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు గుర్రం రమణ పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం నిర్వహించిన సభలో వక్తలు మాట్లాడుతూ, సాధారణ భవన నిర్మాణ కార్మికునిగా జీవితాన్ని ప్రారంభించి, ప్రజా కళలు, పాటల పట్ల ఆసక్తి పొంది అనేకమంది ప్రజా రచయితలు రచించిన ఉద్యమ గీతాలను పట్టుదలగా నేర్చుకుని, 300కు పైగా పాటలను అలవోకగా పాడగలిగిన నిజమైన ప్రజా కళాకారుడు పందిరి రాము అన్నారు. ఇటువంటి వారిని ఆదర్శంగా తీసుకొని ప్రజా సమస్యలపై అనేక పాటలు, ప్రజాసాహిత్యం రావాలన్నారు. ఈ సందర్భంగా పందిరి రామును ప్రజానాట్యమండలి, అల్లూరి విజ్ఞాన కేంద్రం, సిఐటియు, బంధుమిత్రులు, కవులు సన్మానించారు.

ప్రజా పాటల పందిరి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అజశర్మ తదితరులు

ఈ కార్యక్రమంలో దండు నాగేశ్వరరావు, అరుణ్‌జీ, తెలుగు రమణ, హనుమంతురావు, ఎం.నాగేశ్వరరావు, రాంబాబు, ఎల్లాజీ, అప్పలరాజు, నరేంద్ర కుమార్, సంతోష్ కుమార్, నీలం రాజు, రాజులమ్మ, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ సెక్రటరీల సస్పెన్షన్ ఎత్తివేయాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : వార్డు సచివాలయ శానిటేషన్ సెక్రెటరీల అక్రమ సస్పెన్షన్లను నిరసిస్తూ జివిఎంసి ప్రధాన కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం నిరసన తెలిపారు. జివిఎంసి పరిధిలో వార్డు సచివాలయ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తూ గతంలో అక్రమంగా సస్పెన్షన్‌కు గురైన పీటర్‌ను, ఈ నెల 20న వివిధ కారణాలతో 9 మంది వార్డు సచివాలయ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీల అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని నినాదాలు చేశారు. అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని, శానిటేషన్ సెక్రటరీలపై జివిఎంసి అధికారులు వేధింపులు ఆపాలని, సిడిఎంఎ, జిఎస్‌డబ్ల్యుఎస్ ఆదేశాల ప్రకారం సచివాలయ పని వేళలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉద్యోగం చేసే అవకాశం కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం జివిఎంసి కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో ఎడిసి వర్మ, సిఎంఒహెచ్‌లు, ఉద్యోగుల ప్రతినిధి వర్గంతో చర్చలు నిర్వహించారు. వార్డు సచివాలయ ఎన్విరాన్‌మెంట్ ఉద్యోగులు, ముఖ్యంగా మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను అధికారులకు వివరించారు. సమస్యను అర్థం చేసుకున్న అడిషనల్ కమిషనర్ వర్మ, సిఎంఒహెచ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలకు ఉన్న సమస్యలు పరిష్కారంతోపాటు, సస్పెండ్ అయిన వారందరినీ రేపు సాయంత్రం లోపు రీవోక్ చేపిస్తామని హామీ ఇచ్చారు. అధికారుల హామీపై ఉద్యోగులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పీటర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి జంగం అహర్నిశల తదితరులు పాల్గొన్నారు.

'ముస్లిములకు పవన్‌కల్యాణ్ క్షమాపణ చెప్పాలి'

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : కాకినాడలో మంగళవారం నిర్వహించిన వారాహి యాత్రలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను 39వ వార్డు వైసిపి కార్పొరేటర్, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ డాక్టర్ మహమ్మద్ సాదిక్ ఖండించారు. వైసిపి నగర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముస్లిములు భారతదేశంలో ప్రశాంతంగా ఉన్నారంటే అది కేవలం హిందువుల మంచితనం వల్లనేనని ఆయన అనటం తీవ్ర అభ్యంతరకరమని, ఈ మాటలపై ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. లేకుంటే వారాహి యాత్రను అడ్డుకుంటామని హెచ్చరించారు. భారతదేశంలో కేవలం హిందూదేశం మాత్రమే కాదని, అన్ని మతాలు కలిసి జీవించే ప్రజాస్వామ్య దేశం అని, దీనిపై అవగాహన లేకుండా పవన్ కల్యాణ్ మాట్లాడుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో షబ్బం అఫ్రోజ్, మొహమ్మద్ బషీరుల్లాఖాన్, ముఖారిఖాన్ పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నగరంలోని ఎ కేటగిరి రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్ హోల్డర్లకు కు విశాఖ నగర పోలీసు కమిషనర్ డాక్టర్ సిఎం.త్రివిక్రమవర్మ బుధవారం నగర ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్స్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భాగం కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి వారమూ స్టేషన్లలో కౌన్సెలింగ్ ఇస్తున్నా ఆశించిన స్థాయిలో మీలో మార్పు రావడం లేదన్నారు. రౌడీలు, సస్పెక్టులు, పాత నేరస్తుల కదలికలపై ఎల్లవేళలా పోలీసుల దృష్టి ఉంటుందని చెప్పారు. ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తే ఉపేక్షించకుండా వెంటనే పీడీ యాక్ట్, నగర బహిష్కరణ ఉంటాయని హెచ్చరించారు. ఎటువంటి నేరాలకు పాల్పడకుండా ఉండాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు.

వరి కలుపు నివారణకు 'నొవలెక్ట్'

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వరి పొలాల్లోని బ్రాడ్లీఫ్, గడ్డి కలుపు మొక్కలను నియంత్రించడానికి గ్లోబల్ ప్యూర్-ప్లే అగ్రికల్చర్ కంపెనీ కర్టెవా అగ్రి సైన్స్ 'నొవలెక్ట్'ను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా సిరిపురంలోని ప్రముఖ హోటల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కర్టెవా అగ్రిసైన్స్ దక్షిణాసియా అధ్యక్షుడు రవీందర్ బలైన్ మాట్లాడుతూ, కలుపు నివారణకు నొవలెక్ట్ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

'ఆస్తి పన్ను చెల్లించాలి'

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులు పన్నులను చెల్లించాలని కమిషనర్ సిఎం సాయికాంత్‌వర్మ బుధవారం కోరారు.

బహిరంగ ప్రకటన

నేను కర్రి జ్యోతిర్మయి ఆనంద్, తండ్రి లేటు కర్రి సన్యాసిరావు, డో.నెం. 39-20-12/1 మాధవధార, విశాఖపట్నం-7 తెలియజేయునది ఏమనగా

నా అన్నయ్య కర్రి ఉమాకాన్త్ SDS 10448 SVLN Cable TV Network SDS 10448 తను జీవించి యున్నప్పుడు నడిపేవాడు. మా అన్నయ్య ఉమాకాన్త్ 13-05-2021వ తేదీన స్వర్గీస్తులైనారు కనుక అతని పేరు మీద ఉన్న SDS 10448 SVLN Cable TV Network నాపేరు మీద మార్చుటకు కుటుంబ సభ్యులకు గాని ఎవరికైన అభ్యంతరము ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలో అభ్యంతరం తెలియజేయవలెను. అటు మిమ్ముట SDS 10448 SVLN Cable TV Network నా పేరు మీదకు మార్చడం జరుగును.

ఇట్లు...కర్రి జ్యోతిర్మయి ఆనంద్

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM O.S.1469/2022

Between :
State Bank of India, SME Centre, Collectorate Compound, Maharanipeta, Visakhapatnam, Rep. by its Manager ...Plaintiff
And
M/s. Sri Sampath Venkateswara Enterprises, Rep. by its Prop: S.S. Santhosh Kumar & Another ...Defendants

SUMMONS

To,
D-1: M/s.Sri Sampath Venkateswara Enterprises, Rep.by its Prop: S.S.Santhosh Kumar, D.No.46-9-51, Kuppilivari Veedhi, Revenue Ward-15, Dondaparthi, Visakhapatnam-16.
D-2: Satyavarapu Seshagiri Santhosh Kumar, S/o.Krishna Rao, Proprietor of M/s.Sri Sampath Venkateswara Enterprises, D.No.4-128, Komati Veedhi, Gangada, Vizianagaram-535557.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **21-08-2023** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **21-08-2023** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
K. VEDAVATHI, Advocate
Visakhapatnam. **Cell: 7396518669.**

THE HONOURABLE COURT OF M.A.C.T-cum- 3rd ADDL.DISTRICT JUDGE -cum Family Judge COURT AT VIZINAGARAM. I.A. 261/2023 M.V.O.P.420/2022

Between:
K.Jayakumar .....Petitioner
And:
K.Rajeswara Rao & Others .....Respondents

To:
2nd Respondent: Builteck Enterprises rep. by Andhavarapu Jagan Mohan, Hindu, aged 55 years, Owner of AP 39 X 4454, resident of D.No.46-18-20, Dondaparthi, Madhavari Street, Visakhapatnam-530016.

Please take notice that the above O.P. filed by the petitioners for compensation under M.V. Act stands posted to **07.07.2023** for your appearance and you should appear before the above and said court, on that day at about **10-30 A.M.** through your advocate or agent or in person without fail. If you failed to appear before the Court, the matter will be decided exparte in your presence.
(As per the orders dated 25.05.2023 of the Honourable Court)

Chintapalli Appa Rao
Advocate for the Petitioner
Vizianagaram

THE HONOURABLE COURT OF M.A.C.T-cum- 3rd ADDL.DISTRICT JUDGE -cum Family Judge COURT AT VIZINAGARAM. M.V.O.P.420/2022

Between:
K.Jayakumar .....Petitioner
And:
K.Rajeswara Rao & Others .....Respondents

To:
2nd Respondent: Builteck Enterprises rep. by Andhavarapu Jagan Mohan, Hindu, aged 55 years, Owner of AP 39 X 4454, resident of D.No.46-18-20, Dondaparthi, Madhavari Street, Visakhapatnam-530016.

Please take notice that the above O.P. filed by the petitioners for compensation under M.V. Act stands posted to **07.07.2023** for your appearance and you should appear before the above and said court, on that day at about **10-30 A.M.** through your advocate or agent or in person without fail. If you failed to appear before the Court, the matter will be decided exparte in your presence.
(As per the orders dated 25.05.2023 of the Honourable Court)

Chintapalli Appa Rao
Advocate for the Petitioner
Vizianagaram

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

స్వర్ణభారతిలో యోగా పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, మేయర్

యోగా

నిత్యజీవితంలో ఒక భాగం చేయడం ద్వారా మానసిక, శారీరక ప్రశాంతత పొందడంతోపాటు, దీర్ఘకాలిక రుగ్మతలు, ఒత్తిళ్లు దరిచేరకుండా చూడవచ్చని పలువురు అభిప్రాయపడ్డారు. బుధవారం తొమ్మిదవ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వాడవాడలా యోగాపై అవగాహన కల్పించారు. యోగా ప్రాముఖ్యతను వివరించారు. యోగాసనాల పోటీల్లో విజేతలకు బహుమతులిచ్చారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

ప్రజాశక్తి -సీతమ్మధార :యోగా ప్రతిఒక్కరి నిత్యజీవితంలో భాగం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అభిప్రాయపడ్డారు.బుధవారం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వనాథన్ తదితరులతో కలిసి యోగా సాధన చేసారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఐక్యరాజ్యసమితి వేదికగా భారతీయ యోగా విశ్వవ్యాప్తం కావడం ఆనందంగా ఉందన్నారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి.మాట్లాడుతూ, ఎన్నో ఒడిదుడుకులు, ఒత్తిడి, నిరాశ, నిస్పహలతో ఉన్నవారికి ఆయా రుగ్మతల నుంచి విముక్తికి యోగా మంచి సాధనమన్నారు. ఈ సందర్భంగా గీతం డెంటల్ కాలేజీ డాక్టర్ గౌతమ్, డాక్టర్ ఎన్.రాధిక, ఎయు యోగా కేంద్రం నేచురోపతి వైద్యులు డాక్టర్ఆర్.తులసిరావు రచించిన 'యోగా అండ్ డెంటల్ హైజీన్ పుస్తకాన్ని అలాగే . ప్రముఖ యోగా శిక్షకురాలు డాక్టర్ టివిఆర్ చంద్ర రచించిన 'యోగా థెరపీ ఫర్ హైపర్ టెన్షన్' పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి , ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ వెంకటరావు, పతంజలి, ఆర్ట్ ఆఫ్ లివింగ్, నేచర్ క్యూర్, పుష్పాంజలి, ఎయు యోగా విలేజ్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎయూలో... ఎంవిపి కాలనీ : ఎయు సిల్వర్‌జూబ్లీ మైదానంలో రోటరీక్లబ్, ఎయు యోగా కేంద్రం, రాష్ట్ర సమగ్రశిక్ష విభాగం సంయుక్త ఆధ్వర్యాన యోగా దినోత్సవాన్ని ఎయు విసి ప్రసాదరెడ్డి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, సమగ్రశిక్ష ఎపిడి శ్రీనివాసరెడ్డి, డిఇఒ ఎల్.చంద్రకళ, ఎయు రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహా రావు, రొటేరియన్స్ మల్లిక, పి.శ్రీధర్, విద్యాసాగర్, యోగా విభాగం సంచాలకులు ఆచార్య ఒఎస్ఆర్ భానుకుమార్, విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు, డాక్టర్ చిట్టూరి శ్రావణి తదితరులు వికలాంగ చిన్నారులతో కలిసి యోగసనాలు వేశారు.

ఎంవిపి కాలనీ : జివిఎంసి ఎస్ 3 స్పోర్ట్స్ ఎరినా ఆధ్వర్యాన ఎంవిపి కాలనీలోని ఇండోర్ స్పోర్ట్స్ ఎరినాలో యోగా దినోత్సవాన్ని న్విహించారు. ఈ కార్యక్రమంలో సహాని, డాక్టర్ డ్యుక్, సుమన్, యోగా మాస్టర్ అర్జున్ పాల్గొన్నారు. ఓం ఉచిత యోగా సంస్థల వ్యవస్థాపకుడు చిలక వెంకట రమేశ్ ఆధ్వర్యాన బీచ్ రోడ్డులో యోగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి వి.మురళీధరన్ హాజరై మాట్లాడారు. ఎయు విసి పివిజిడి ప్రసాద్‌రెడ్డి, భాను కుమార్, శాంతారామ్ పాల్గొన్నారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ ఎరినాలో వాల్తేర్ డివిజన్, ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు యోగా నిర్వహించారు. పారిజాత సత్పతి, యోగా నిపుణుడు ప్రవీణ్, డివిజనల్ ఎడిఅర్ఎం సుధీర్ కుమార్ గుప్తా, ఎడిఅర్ఎం మనోజ్ కుమార్ సాహూ పాల్గొన్నారు. ఎంవిపి.కాలనీలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రంలో యోగా నిర్వహించారు. ఆంధ్రా యూనివర్సిటి యోగా శాఖలో సహాయ ఆచార్యులు డాక్టర్ ఆర్.తులసీరావు 'నిత్య జీవితంలో యోగా ఉపయోగాలు' అంశంపై ప్రసంగించారు. ప్రాంతీయ కేంద్ర సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు సభను ప్రారంభించారు. ఇగ్నో ప్రాంతీయ కేంద్రం సహాయ రిజిస్ట్రారు ఎఎల్‌పి.రావు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

గాజువాకలో యోగా చేస్తున్న మహిళలు

సీతమ్మధార : అక్కయ్యపాలెం వాగ్దేవి పాఠశాలలో భారత్ వికాస్ పరిషత్, విశాఖపట్నం శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రముఖ యోగా గురువు సోర్ణపూడి గణేష్ పాల్గొని యోగాసనాల ప్రాముఖ్యత వివరించారు. ఆర్‌సి జైన్, ఎంవివి సత్యనారాయణ, ఎంవి రాజశేఖర్, పంపాన వెంకటేశ్వరరావు, పి భాస్కరరావు, ఝాన్సీ లక్ష్మీబాయి, శైలజ పాల్గొన్నారు

కరాస: మర్రిపాలెం రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయంలో పాస్‌పోర్టు అధికారి విశ్వాంజలి గైక్వాడ్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. యోగ గురువు కెవిఎస్ఎన్ మూర్తి పాల్గొని యోగాసనాల ఆవశ్యకతను వివరించారు.

భీమునిపట్నం :అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అమత్ సరోవర్ చెరువులైన సింగనబంద, మామిడిబంద చెరువు, తాటితూ రు, పెద్దచెరువు, మజ్జిపేట వల్లయ్యబంద చెరువుల వద్ద ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒ జివిఎస్ గౌరి ఆధ్వర్యంలో కూలీలతో యోగసనాలు వేయించారు. టిఎలు డివి సుధాకర్, జి అచ్యుతరావు పాల్గొన్నారు

తాటితూరు జెడ్‌పి హైస్కూల్ లో... హిందీ ఉపాధ్యాయులు, యోగా గురువు టిఎస్‌వి ప్రసాదరావు మానవత్వం కోసం యోగా థీమ్‌తో ప్రపంచవ్యాప్తంగా యోగా వేడుకలు జరుగుతున్నా యన్నారు. హెచ్‌ఎం డి శ్రీనివాసరావు, ఉపాధ్యా యులు జె అప్పలనాయుడు, చంద్రశేఖర్, సూర్యనారా యణ, తారకేశ్వర రావు, పిఇటి జి ప్రసాదరావు, ప్రభా వతి, విజయకుమారి ఉన్నారు



నక్కపల్లిలో కస్తూర్బావిద్యార్థినుల యోగాభ్యసన

ప్రభుత్వ డైట్‌లో..ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎల్ సుధాకర్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. అధ్యాపకులు ఎస్ త్రినాథరావు, గొట్టేటి రవి, ఎం మహాలక్ష్మి, సోమయాజులు, అల్లాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు

ఎస్‌ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో... ఎస్‌ఒఎస్ ప్రోగ్రాం అధికారి కె దుర్గరాజు, వి.సత్యనారాయణ, యానిమేటర్లు, టీచర్లు విద్యార్థులు ఆధ్వర్యంలో యోగా వేడుకలు నిర్వహించారు

బీచ్‌రోడ్డులో... లైట్ హౌస్ వద్ద లైట్ హౌసెస్ అండ్ లైట్ షిప్స్ విశాఖ ప్రాంతీయ డైరెక్టర్ ముఖేష్ పార్మర్, డిప్యూటీ డైరెక్టర్ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

అవంతి కళాశాలలో... తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో యోగా దినోత్సవంలో ఆనందాశ్రమం నుంచి కె యోగానందరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ ఎ అర్జునరావు, ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ షరీఫ్ పాల్గొన్నారు.విద్యార్థుల చే యోగాసనాలు వేయించారు

గీతంలో...మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కోడి రామమూర్తి ఇండోర్ స్టేడియం లో యోగా దినోత్సవంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, క్యాంపస్ లైఫ్ ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, ఎన్‌సిసి అధికారి కెప్టెన్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ పరిమళవేణు, డాక్టర్ రమణరావు తదితరులు పాల్గొని స్వయంగా యోగ, ధ్యాన ప్రక్రియలను ప్రదర్శించారు.యోగా నృత్యరీతులను విద్యార్థులు ప్రదర్శించారు. జిమ్‌సర్ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోతి పద్మజ విద్యార్థులను అభినందించారు.

పద్మనాభం : మండల పరిషత్ కార్యలయంలో ఎంపిడిఒ ఎం విజయకుమార్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. వెలుగు, ఉపాధిహామీ పథకం, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందపురం :స్థానిక మహాత్మా గాంధీ పూలమార్కెట్ యార్డులో సరస్వతి విద్యా విహార్ ఆధ్వర్యంలో యోగాదినోత్సవం నిర్వహించారు. తమ్మిన నర్సింగ రావు గాయత్రి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ దుక్కఅప్పలరాజు, కె.నారాయణ రావు, కోరాడ అప్పలస్వామి నాయుడు పి సూర్యనారాయణ, జంగం జోషి తదితరులు పాల్గొన్నారు..

యోగా వేడుకల్లో రీజనల్ పాస్‌పోర్టు అధికారిణి విశ్వాంజలి

గాజువాక. : గాజువాక హైస్కూల్ రోడ్ సాయిరాంనగర్ స్వామి విద్యానికేతన్‌లో ఎన్ఎస్ఎస్ కెప్టెన్ టి.సూర్యకుమారి, స్కూల్ ఇన్‌ఛార్జి జి.పద్మజ, కరస్పాండెంట్ పాలూరు దేవి ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు పాల్గొన్నారు. చైతన్య నగర్ చైతన్య టెక్నో హైస్కూల్‌లో హెచ్‌ఎం ఎ.అరుణకుమారి ఆధ్వర్యంలో పిఇటి పర్యవేక్షణలో యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం నిర్వహించారు. ఎఒ, ఇన్‌ఛార్జిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.గాజువాక రవీంద్ర ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో యోగా గురువు ఈశ్వరరావు విద్యార్థులతో వివిధ రకాల యోగాసనాలను వేయించారు. టీచర్లు కిరణ్మయి, తులసీరత్నం, ఎస్‌వికె. పరుశురాం పాల్గొన్నారు.

ఆరిలోవ : చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో యోగా బోధకులు, సంఘ సేవకుడు బుడ్డిగ సత్యనారా యణ మూర్తి యోగాసనాలపై తర్ఫీదు ఇచ్చారు. ఆలయ ట్రస్టు చైర్మన్ వానపల్లి అప్పారావు యోగాసనాల ఆవశ్యకతను వివరించారు. జివిఎంసి వాటర్ వర్క్స్ ఎఇ అప్పాజీ పాల్గొన్నారు. యోగాశిక్షకులు సత్యనారాయణ మూర్తిని సత్కరించారు.

నక్కపల్లి: మండలంలోని వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేంపాడు ఆయుర్వేద డిస్పెన్సరీ, వికాస తరంగణి ఆధ్వర్యంలో యోగా డేనిర్వహించారు. ఆయుర్వేద ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ రమేశ్ కుమార్, సర్పంచ్ ఏడిద నూకరత్నం, డీసీఎంఎస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు అయినంపూడి మణిరాజు, అవతారం రాజు, దశరధరాజు, హెచ్‌ఎం నర్సింగరావు, వికాస తరంగణి చీఫ్ కోఆర్డినేటర్ సుజాత పాల్గొని యోగా పోటీల్లో విజేతలకు బహుమ తులు అందజేశారు. యోగా ఇన్స్ట్రక్టర్లు పార్వతీ దేవి, రాంబాబు, పీడీ రాం కుమార్, మణి, శివరామకష్ణ పాల్గొన్నారు. వేంపాడు టోల్ ప్లాజా వద్ద మేనేజర్ కృష్ణ, ఐఎంటిమేనేజర్ సత్యనారా యణ, చినదొడ్డిగల్లు హైస్కూల్లో హెచ్‌ఎం కవిత ఆధ్వర్యంలో పిల్లలకు యోగా శిక్షణ ఇచ్చారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో విద్యార్థినుల యోగాసనాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ములగాడ : 58వ వార్డు శ్రీహరిపురం జివిఎంసి పాఠశాలలో హెచ్‌ఎం ఎంవి. లక్ష్మణ్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు ప్రకాష్, వ్యాయామ ఉపాధ్యాయుల ఎం..మంగ పాల్గొన్నారు.

ఆనందపురం : గంభీరంలో మైత్రేయి యోగా సంస్థ ఆధ్వర్యంలో సత్య కల్యాణ్ అపార్ట్‌మెంట్‌లో యోగ దినోత్సవాన్ని వైస్ ఎంపిపి బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ ప్రారంభించారు. యోగా టీచర్ శ్యామల జగదీశ్వరి ఆధ్వర్యంలో ఐద్వా మాజీ అధ్యక్షురాలు కె. ద్రాక్షాయణి, విద్యార్థులు సరిత, దుర్గాదేవి, రమాదేవి, లావణ్య, ఉష, సంధ్య, జ్యోతి, స్వాతి, త్రిపుర, తిలక్, ఉష, కనిమొలి, జయతి, మాధురి,రూప, మణి, శ్యామల జగదీశ్వరి ఉన్నారు

గోపాలపట్నం : విశాఖ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్ పట్నాయక్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సిహెచ్ వీరునాయుడు. డాక్టర్ దయానా వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం రాజయోగ ఆర్మీ శిక్షకుడు లాలం రాజబాబు ఆధ్వర్యంలో స్థానిక బాలికల జూనియర్ కళాశాల మైదానంలో అల్లాడ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడ సురేష్, సహకారంతో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

అనకాపల్లిలో యోగాభ్యసనలో కలెక్టర్ రవిసుభాష్ పట్టన్‌శెట్టి

వైద్యులు విజయ శాంతి, రాయపురెడ్డి శ్రీనివాస్, బొంతు జగదీష్, జీజే బాలికల కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, మాంటిస్సోరి స్కూల్ ప్రిన్సిపల్ రాజేష్, హరి ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ పంచాడ హరినాథ్, జనసేన వూడిచక్రవర్తి పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండలంలోని కొరుప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయుష్ విభాగం మెడికల్ ఆఫీసర్ సుజాత ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. యోగా శిక్షకులు శంకర్, రమేష్, ఎంపిటిసి వెంకటలక్ష్మి, హెచ్‌ఎం పురుషోత్తం, పిఎసిఎస్ అధ్యక్షులు చేకూరి శ్రీరామ చంద్రరాజు, పిడి సత్యన్నారాయణ పాల్గొన్నారు.

గొలుగొండ:లింగంపేట గ్రామంలో ఉపాధి కూలీల కుటుంబ సభ్యులకు యోగాపై అవగాహన కల్పించారు. వీఆర్పీ మండపాక రమణ, మేట్‌లు, కూలీలు పాల్గొన్నారు.

అనకాపల్లి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి అన్నారు. తొమ్మిదవ అంతర్జాతీయ యోగా దినోత్సవం స్థానిక గవరపాలెంలో ఉన్న రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో బుధవారం ఆయుష్మాన్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని కలెక్టర్ రవి, జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ జ్యోతి ప్రజ్వలన ప్రారంభించారు. మొదటగా కామన్ యోగ బ్రోచర్‌ను ఆవిష్కరించి యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ పి.వెంకటరమణ, జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ బివి.సత్యవతి, జివిఎంసి జోనల్ కమిషనర్ వెంకటరమణ పాల్గొన్నారు. జార్జ్ క్లబ్‌లో పతాంజలి యోగ సమితి, ఎఎంఎఎల్ కళాశాల ఎన్‌సిసి ఆర్మీ విభాగం ఆధ్వర్యంలోనూ యోగా డే నిర్వహించారు. స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో యోగాసనాలపై అవగాహన, ప్రయోజనాలను యోగా గురువు ఎం.జగన్నాధరావు, ఎం.లీల వివరించారు. స్థానిక జీవిత బీమా కార్యాలయంలో బుధవారం బ్రాంచ్ మేనేజర్ ఉదయ్ సాగర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.

పరవాడ : ఎన్టీపీసీ సింహాద్రిలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమాన్ని ప్రాజెక్టు హెడ్ కెఎస్.సిన్హా ప్రారంభించారు. ఉద్యోగులు, దీపాంజలి నగర్ నివాసితులతో యోగా గురువు వివిధ యోగాసనాలు వేయించారు.

చోడవరం : వాకర్ ఫ్రెండ్స్ హెల్త్ క్లబ్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంయుక్త ఆధ్వర్యంలో కోఆపరేటివ్ కాలనీలో గాంధీ విగ్రహం నుంచి ప్రధాన రహదారి మీదుగా విఘ్నేశ్వరుడు ఆలయం వరకు యోగాపై అవగాహన ర్యాలీ జరిగింది.

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగా గురువు పి.సత్యనారాయణ, ఎన్‌సిసి ఉపాధ్యాయులు ఆర్.ప్రసాద్ ఆధ్వర్యాన విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఎంఇఒ ఎస్.అప్పలరాజు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే యోగా ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంత్రి జయరజనీ, ఎమ్ఇఓలు చిట్టిబాబు, సూర్యనారాయణమూర్తి, పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్ : రవిశంకర్ గురుదేవ్ శిష్య బృందం మళ్ల రాము ఆధ్వర్యంలో స్థానిక గోపిశెట్టి మూలరాజు కళ్యాణ మండపంలోనూ, మండలంలోని కొక్కిరాపల్లి గురుకుల పాఠశాలలోనూ యోగాసనాలలో మెలుకువలు నేర్పారు.

బుచ్చయ్యపేట : ఉపాధి హామీ ఎపిఒ మురళి ఆధ్వర్యాన ఉపాధి కూలీలు యోగాసనాలు వేశారు. పి.భీమవరం సోమరాజు అమత్ సరోవర్, పెదమదీన తివ్వకొండ, కందిపూడి వారాధి చెరువు, శివరాంపురం నక్కవారి బంధ, దిబ్బిడి యళ్ళమ చెరువు వద్ద యోగా డే నిర్వహించారు.

భీమిలిలో పని ప్రదేశంలో యోగా చేస్తున్న ఉపాధి కూలీలు

బిఆర్‌టిఎస్ నిర్వాసితులకు న్యాయం చేయాలి

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న గంగారావు, తదితరులు

ప్రజాశక్తి- సింహాచలం: పాత గోశాల నుంచి అడవివరం వరకు బిఆర్‌టిఎస్ కారిడార్‌లో ఇళ్లు, ఇతర ఆస్తులను కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం చేయాలని సిపిఎం కార్పొరేటర్, జివిఎంసిలో ఆ పార్టీ ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి.గంగారావు కోరారు. ఈ మేరకు జివిఎంసి కమిషనర్‌ను కలిసి, నాలుగు ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ముఖ్యంగా ఇళ్లస్థలాలు కోల్పోయే వారికి మార్కెట్ ధర ప్రకారం ఐదు టిడిఆర్‌లు ఇవ్వాలని, ప్రతి నిర్వాసిత కుటుంబానికీ మూడు సెంట్లు ఇంటి స్థలం 98వ వార్డు పరిధిలోనే ఇవ్వాలని, నిర్వాసితులు భవన నిర్మాణ విలువతో పాటు నష్టపోతున్న చెట్లు, ఇతర ఆస్తులకు నష్టపరిహారం చెల్లించాలని, రోడ్డు విస్తరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోయి, తిరిగి అడివివరం ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకునే వారికి సింహాచల దేవస్థానం, జివిఎంసి ఎలాంటి ఆంక్షలు విధించకుండా ముందుగా అనుమతులు ఇవ్వాలని, అలాగే వీరు నూతనంగా నిర్మించుకునే ఇళ్లకు జివిఎంసి ప్లాన్ అనుమతుల రుసుం మినహాయింపు ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. నిర్వాసితులకు ఆమోదయోగ్యమైన పరిహారం చెల్లించకుండా దౌర్జన్యంగా పనులు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి టివి.కృష్ణంరాజు, ఎ.నాగమణి, రఘువరన్ పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి సహకరించండి

వైవి.సుబ్బారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బాణాల, పక్కనే కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార: 44వ వార్డు అక్కయపాలెంలోని వేణుగోపాల స్వామి ఆలయ పునర్నిర్మాణానికి సహకరించాలని జివిఎంసి ఫ్లోర్‌లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె రాజు సమక్షంలో ఉత్తరాంధ్ర జిల్లాల వైసిపి రీజినల్ కోఆర్డినేటర్, టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేశారు. సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించారని బాణాల శ్రీనివాసరావు తెలిపారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి-పద్మనాభం : అందరూ సహకరిస్తేనే పాఠశాల అభివృద్ధి సాధ్యపడుతుందని స్థానిక ఎంపిపి ఎంపిపి కె రాంబాబు అన్నారు. బుధవారం మండలంలోని రేవిడి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో బదిలీపై వెళ్తున్న ముగ్గురు ఉపాధ్యాయులకు వీడ్కోలు, సన్మాన సభ నిర్వహించారు. బదిలీ ఉపాధ్యాయుల.ఎంవిటికె నాగేశ్వరరావు, కె మాధురిరాణి, టివి రామిరెడ్డిలను ఘనంగా సత్కరించి, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎంపిపి రాంబాబు మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధికి స్థానికులు సహకరించడం అభినందనీయమన్నారు. గ్రామ పెద్దలు ఎం అప్పారావు, కోన రమణ, నరిసింగరావు, సత్యనారాయణ, శ్రీను.తదితరుల ఆర్థికసాయంతో పాఠశాలలో మౌలిక సౌకర్యాలను సమకూరుస్తున్నామన్నారు. విద్యార్థులు రెగ్యులర్ పాఠశాలకు వచ్చి క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలని, ఉపాధ్యాయులు దానికి అనుగుణంగానే విద్యాబోధన చేసి, పాఠశాల కీర్తిప్రతిష్ఠలు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమములో యుటిఎఫ్ మాజీ అధ్యక్షులు బోని సన్యాసినాయుడు, ఎంపిటిసి సూరప్పడు పాల్గొన్నారు.

విద్యుత్ చట్టం విధివిధానాలపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం :స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యుత్ చట్టం, విధి విధానాలపై బుధవారం ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు అధ్యక్షతన విద్యార్థులకు, విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించారు.విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ డాక్టర్ బి సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎస్.సురేష్‌బాబు, స్వతంత్ర సభ్యులు ఇ సురేంద్రకుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.రమేష్, సహాయ ఇంజనీరింగ్ అధికారులు శేఖ'య్య, బి రవి, జె రాము పాల్గొన్నారు. స్థానిక కృష్ణాకాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. విద్యుత్ అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలు, వినతిపత్రాలను పరిశీలించారు.

జల్ జీవన్ మిషన్‌పై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం: తర్లువాడ సచివాలయంలో జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో నీటి వనరుల వినియోగం, పొదుపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపిపి శారదా ప్రియాంక, వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సర్పంచ్ బిఆర్‌బి నాయుడు, జిల్లా కోఆర్డినేటర్ పుల్లయ్య, మండల కోఆర్డినేటర్ జగదీశ్వరి, పంచాయతీ సెక్రటరీ కె.కరుణాకరరావు పాల్గొన్నారు.

గణబాబును కలిసిన ఎయిర్‌పోర్టు డైరెక్టర్

ఎమ్మెల్యే గణబాబుతో రాజారెడ్డి

ప్రజాశక్తి -గోపాలపట్నం : విశాఖ ఎయిర్‌పోర్టు డైరెక్టర్‌గా నూతనంగా నియమితులైన రాజారెడ్డి బుధవారం పశ్చిమ ఎమ్మెల్యే గణబాబును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందించారు. అనేక విషయాలపై చర్చించారు.

క్విజ్ పోటీల్లో చిట్టివలస హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ చూపిన విద్యార్థులతో బ్యాంక్ ప్రతినిధులు, టీచర్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : భారతీయ రిజర్వ్ బ్యాంకు అధికారుల ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బా విద్యాలయంలో జిల్లాలో ఇప్పటికే ఎంపిక చేసిన జెడ్‌పి జెడ్పీ ఉన్నత పాఠశాలల 9వ తరగతి విద్యార్థులకు ఫైనాన్షియల్ లిటరసీ అంశంపై బుధవారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో చిట్టివలస జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచారని హెచ్ఎం పొట్నూరు మురళీ మోహన రావు తెలిపారు.

గత నెల 28న చంద్రంపాలెం జెడ్‌పి హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన ఇద్దరు విద్యార్థులకు బ్యాంక్ ప్రతినిధులు రూ 5వేలు నగదు బహుమతి, సర్టిఫికెట్ ప్రదానం చేశారు. వీరిని హెచ్ఎం మురళీ మోహనరావు, కెజిబివి స్పెషల్ ఆఫీసర్ గంగాకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు

టిడిపి మేనిఫెస్టోపై విస్తృత ప్రచారం

కరపత్రాలను పంచుతూ ప్రచారం చేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇటీవల టిడిపి మహానాడులో అధినేత చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోపై 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం వార్డులోని వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి మెనిఫెస్టోలో విషయాలను స్థానికులకు వివరిస్తూ, కరపత్రాలు పంచి పెట్టారు. వార్డు అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, మద్దిల రాజశేఖర్, బిసి సెల్ అధ్యక్షులు వివిఎన్ మూర్తి, బలగం సుధాకర్, వెంకట రామారావు, అప్పలనాయుడు, వేమల వెంకటరావు, కొండమ్మ, ధనలక్ష్మి, లక్ష్మి, చైతన్య పాల్గొన్నారు

జూ పార్కులో జంతు ఆరోగ్య కమిటీ సమావేశం

యానిమల్ కీపర్స్‌తో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : జూ పార్కులోని జంతువుల శ్రేయస్సు, ఆరోగ్యానికి సంబంధించిన అజెండా, వివిధ అంశాలు చర్చించేందుకు బుధవారం ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో జంతు ఆరోగ్య కమిటీ సమావేశం నిర్వహించారు. జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా అధ్యక్షతన జరిగిన సమావేశానికి జూపార్కు అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ నవీన్‌కుమార్, నెహ్రూ జులాజికల్ పార్కు రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ నేతృత్వంలో సీనియర్ వెటర్నరీ వైద్యుల బృందం పాల్గొంది. జంతువుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించడం, వాటి శ్రేయస్సు కోసం తీసుకోవలసిన చర్యలు, పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ, పశువైద్య చికిత్స పలు అంశాలపై చర్చించారు. అనంతరం కమిటీ సభ్యులం దరూ జూలో అన్ని జంతువుల ఎన్‌క్లోజర్లను సందర్శించి, వాటి ప్రవర్తనను నిశితంగా పరిశీలించారు. సమావేశంలో డాక్టర్ ఫణీంద్ర, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి. గోపాల నాయుడు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు రాజేశ్వరరావు, భారతి, జూనియర్ వెటర్నరీ డాక్టర్ పురుషోత్తం పాల్గొన్నారు.

పేద విద్యార్థుల కాలేజీ ఫీజుకు ఆర్థిక సాయం

ఆర్థికసాయం పొందిన విద్యార్థులతో సునీల్ మహంతి

ప్రజాశక్తి -పిఎం పాలెం : మధురవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఉత్తీర్ణతలైన పేద విద్యార్థులకు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎన్ఎస్ఎస్‌సి. ఇఇ సునీల్ మహంతి బుధవారం ఆర్థికసాయం అందించారు. విశాలాక్షినగర్ బివికె కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకునేందుకు 12మంది పేదవిద్యార్థులకు అవసరమైన ఫీజును తన సొంత నిధుల నుంచి చెక్ రూపంలో ద్వారకానగర్ బివికె.కళాశాల ప్రిన్సిపాల్ జోగిరాజు, కరస్పాండెంట్ శ్రీధర్‌లకు అందచేశారు. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆటంకం కాకుండా ఏటా కొంతమందికి ఇలాగే తాను ఫీజు చెల్లిస్తు న్నానన్నారు. అలాగే.బాస్కెట్‌బాల్ క్రీడలో ఆసక్తి కనబరుస్తున్న కొందరు క్రీడాకారులకు కూడా తాను ఆర్థికసాయం అందించి చదివిస్తున్నానన్నారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ భూషణరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం 11కెవి ఫీడర్‌లో విద్యుత్ లైన్ల మెయింటెనెన్స్‌లో భాగంగా ఈనెల22న గురువారం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఆపరేషన్స్ ఎఇఇ సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వేములవలస, ఈగలవానిపాలెం, దుక్కవానిపాలెం, తర్లువాడ గుడిలోవ, వెళ్ళంకి పాలవలస, మె ట్టమీదపాలెం, ప్రకృతివానిపాలెం, సీతంపాలెం తదితర 21 గ్రామాలలో గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ అంతరాయము కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలన్నారు

రేపు కరెంట్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి మూడోజోన్, పిఎం పాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని 11కెవి మొగదారమ్మ ఫీడర్‌లో నిర్వహణ, మరమ్మతుల కారణంగా ఈనెల 23న శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని సబ్‌స్టేషన్ ఎఇఇ మండల అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇఇ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆర్‌టిసి డిపో ఏరియా, సినీ పోలీస్ థియేటర్, ఓల్డ్ మధురవాడ మెట్ట, ఆదిత్య టవర్స్ తదితర ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

స్వశక్తితో యువత ఎదగాలి

ప్లేస్కూల్ ప్రారంభోత్సవంలో ముత్తంశెట్టి మహేష్

ప్రజాశక్తి -ఆనందపురం: యువత స్వయంఉపాధితో ఆర్థికస్వావలంభన సాధించాలని భీమిలి నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్ అన్నారు. బుధవారం ఆనందపురం కూడలి, బిపి కల్లాలు రోడ్‌లో విద్యావేత్త, వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాకర సురేష్‌కుమార్, లహరి మండలంలో మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేసిన ది ఐ స్కూల్ (ప్లే స్కూల్)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత రాష్ట్రానికి మూల స్తంభాల్లాంటి వారని, వేరే ఉద్యోగాల కోసం ఎదురుచూడ కుండా, స్వశక్తితో తాము అభివృద్ధి చెందడమే కాకుండా మరికొందరికి ఉపాధి మార్గాలను చూపించాలని సూచించారు. జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బంటుపల్లి మణిశంకర్‌నాయుడు సురేష్ దంపతులను అభినందించారు. వైసిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్‌ఎంపిపి బొట్టా ధనలక్ష్మి రామకృష్ణ, కాకర వెంకటరమణ, పిన్నింటి వెంకటరమణ, చందక సూరిబాబు, కోరాడ అప్పలస్వామినాయుడు, బిఆర్‌బి నాయుడు, ఉప్పాడ లక్ష్మణరావు, కె.దామోదరరావు, కె.చంద్రమౌళి, ఉప్పాడ సూరిబాబు, వానపల్లి ముత్యాలరావు, మీసాల రామునాయుడు, లోడగల రమణ, మహంతి శివాజీ, ఎ.దేవుడుబాబు, కె.వైకుంఠ, బి బంగార్రాజు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు..!

ప్రజాశక్తి -గాజువాక : సొంత పెదనాన్న, అతని పిల్లలే తనపై దాడిచేయడంతోపాటు తన ఆస్తిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేసినా న్యూపోర్టు పోలీసులు పట్టించుకోవ డం లేదని హరిప్రసాద్ అనే వికలాంగుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ, పెదగంట్యాడ ప్రభుత్వ హైస్కూల్ దగ్గర్లో పాతికేళ్లుగా తాను నివాసముంటున్నానని, తన బంధువులే తనపై దాడి చేసి, ఇల్లు కూల్చేస్తామని హెచ్చరిస్తు న్నారన్నారు. మంగళవారం రాత్రి ఇంట్లోకి చొరబడి తనపై దాడి చేసి గాయపరచడంతోపాటు, ఇల్లు కూల్చేస్తామని బెదిరించారన్నారు. వారి దాడిలో తన పక్కటెముకకు తీవ్రగాయమైనందని, కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని, ఎంఎల్‌సి రిపోర్టుతో పోలీసులకు ఇచ్చినా స్పందించడం లేదన్నారు. కోర్టు తీర్పుమేరకు ఆస్తి కాగితాలన్నీ తనవద్దే ఉన్నా, తన పెదనాన్న పిల్లలు దౌర్జన్యం చేస్తున్నారని, స్థానిక కార్పొరేటర్ వారికి అండగా నిలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనకు ప్రాణహాని ఉన్న నేపథ్యంలో పోలీసులు న్యాయం చేయాలని వేడుకుంటున్నాడు.

దాడి, చోరీ కేసులో పది మంది అరెస్టు

ప్రజాశక్తి-అనకాపల్లి

వాహనాన్ని అడ్డగించి నలుగురిపై దాడి చేసి వారి నుంచి నగదు దొంగలించిన కేసులో పదిమంది నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఎస్పి కథనం ప్రకారం.... విశాఖకు చెందిన ముప్పిడి మహేష్, అతని తండ్రి రాంబాబు ఏజెన్సీలోని వారపు సంతల్లో బట్టలు విక్రయిస్తుంటారు. ఈనెల 19న వారి దగ్గర పని చేస్తున్న సతీష్, కారు డ్రైవర్ నాగరాజుతో కలిసి వారు పెదబయలు వారపు సంతకు వెళ్లారు. అనంతరం చెన్నైలో దుస్తులు కొనుగోలు నిమిత్తం మహేష్ వెళ్లేందుకు పెద బయలు నుండి ఆ రోజు మధ్యాహ్నం అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు తమ కారులో నలుగురు బయలుదేరారు. పాడేరు దాటిన తరువాత వారి కారును అనకాపల్లి గవరపాలానికి చెందిన ఎల్లపు నూకేష్, మొల్లేటి లోకేష్ హోండా యాక్సెస్ వాహనంపై ఫాలో అవుతూ వచ్చారు. వెంకన్న పాలెం జంక్షన్ దాటిన తర్వాత మరో మూడు వాహనాలపై మరో ఏడుగురు బవులువాడ దర్జీ నగర్ సమీపంలో కారును ఆపి మీరు గంజాయి రవాణా చేస్తున్నారని బెదిరించి వారిని బలవంతంగా చేతులు కట్టి కొట్టి డైట్ కాలేజీ సమీపంలో నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ ముప్పిడి మహేష్ నుంచి రూ.18,000, అతని తండ్రి నుంచి రూ.2000 తీసుకొని పారిపోయారు. దీనిపై మహేష్ రూరల్ పోలీస్ స్టేషన్లో ఈనెల 20న ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆదేశాల మేరకు దర్యాప్తులో భాగంగా క్రైమ్ అడిషనల్ ఎస్పీ సత్యనారాయణరావు ఆధ్వర్యంలో డీఎస్పీ వి.సుబ్బరాజు పర్యవేక్షణలో రూరల్ సీఐ రవికుమార్ దర్యాప్తు చేసి 16 గంటల్లోనే 9 మంది నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసులో నేరానికి ఉపయోగించిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో గవరపాలానికి చెందిన కర్రి పూర్ణ దర్శక్, దోమరోతు మోహన్, కొణతాల దివాకర్, సరగడం మహేంద్ర కుమార్, పొలమరశెట్టి లోకేష్, అనకాపల్లి నెయ్యిల వీధికి చెందిన దుప్పాడ అనిల్, నర్సీపట్నం మండలం నీలంపేట గ్రామానికి చెందిన ఏసంశెట్టి భరద్వాజ్‌లను అరెస్టు చేయగా, అనకాపల్లి విజయరామరాజుపేటకు చెందిన ఎర్రంశెట్టి వంశీ పరారీలో ఉన్నాడు. కేవలం 16 గంటల్లోనే కేసును ఛేదించిన సిబ్బందిని ఎస్పీ మురళీకృష్ణ అభినందించారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి మురళీకృష్ణ

బాల కార్మికులకు వ్యత్యాస జీతం అందజేస్తున్న మునిస్వామి

బాల కార్మికులకు వ్యత్యాస జీతం అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు జిల్లాలో జూన్ 1 నుండి చేపడుతున్న తనిఖీల్లో మునగపాక మండలం శ్రీనూకలక్ష్మి నారాయణమ్మ ఎంటర్ ప్రైజెస్‌లో ముగ్గురు బాల కార్మికులను గుర్తించారు. వారి ముగ్గురు బాల కార్మికులకు, మిగిలిన కార్మికులతో పోల్చితే జీతం వ్యత్యాసం ఉండటాన్ని గుర్తించి, ఆ వ్యత్యాస జీతాల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.10,749 చొప్పున మొత్తం రూ.32,247 కార్మిక శాఖ జిల్లా అధికారి మునిస్వామి ద్వారా అందించారు. కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారి బాలకృష్ణ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

బంగారమ్మపాలెం సచివాలయంలో భూముల రిజిస్ట్రేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని బంగారమ్మ పాలెం సచివాలయంలో భూముల రిజిస్ట్రేషన్ స్థానిక తహశీల్దార్ బి.సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయపుర అగ్రహారం రెవిన్యూ పరిధిలోని మాజీ సర్పంచ్ దొడ్డి అప్పారావుకు చెందిన భూమికి సంబంధించి రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. భూమి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను దొడ్డి అప్పారావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు, దొడ్డి సూర్య ప్రకాష్, మండల సర్వేయర్ కె.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది గాయత్రి, రూప, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు ఇప్పించలేని అసమర్ధ మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి

అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇప్పించలేని అసమర్ధ మంత్రిగా గుడివాడ అమర్‌నాథ్ మిగిలిపోతారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. తనకు చేతకాక అధికారుల వైఫల్యం వల్లే పనులు జరగడం లేదని చెప్పడం మంత్రి రెండు నాలుకుల ధోరణికు నిదర్శనమన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అనకాపల్లి పట్టణంలో అభివృద్ధి పనులతో పాటు సుందరీకరణ పనులు చేపడుతామని మంత్రి చెప్పడం చూస్తుంటే దెయ్యాల వేదాలు వల్లించిన చందంగా ఉందన్నారు. 2022 -23 ఏడాదిలో ప్రతి కార్పొరేటర్ పరిధిలో రూ.1.50కోట్లు నిధులు మంజూరు కాగా, వాటితో చేపట్టిన చేపట్టిన పనులకు బిల్లులు రాలేదన్నారు. ఎన్నికల సమీపిస్తున్న వేళ సమస్యలన్నీ ఇప్పుడు గుర్తుకొస్తున్నాయని ఎద్దేవా చేశారు. సమావేశంలో టిడిపి నాయకులు బొడ్డేడ జోగినాయుడు, బోడి వెంకటరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగజగదీశ్వరరావు

దళిత యువకుడు రాజేష్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తాం : కెవిపిఎస్

ప్రజాశక్తి - దేవరాపల్లి

మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామంలో దళిత యువకుడు ఓలిమరక రాజేష్‌పై దాడిచేసిన పెత్తందార్లను వెంటనే అరెస్టు చేయాలని కులవివక్షత వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాడి ప్రసాద్, ఈర్లె చిరంజీవి బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. భూమి వివాదంలో రాజేష్‌పై ఏప్రిల్ 17న ఆ గ్రామానికి చెందిన పెత్తందార్లు దాడి చేయగా, రాజేష్ దేవరాపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. నాలుగు రోజులు తరువాత ఏప్రిల్ 21న కేసు నమోదు చేసిన పోలీసులు, రెండు నెలలు దాటినా నేటికీ నిందితులను అరెస్టు చేయలేదని తెలిపారు. దర్యాప్తు పేరుతో పోలీసులు కాలక్షేపం చేస్తూ దోషులను రక్షించే ప్రయత్నంలో ఉన్నారని విమర్శించారు. ఇప్పటికే దళితులకు రక్షణ లేకుండా పోయిందని, పోలీసుల తాత్సారం వల్ల మరిని సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వెంటనే దాడి చేసిన పెత్తందారులను అరెస్టు చేయకపోతే జిల్లా వ్యాప్తంగా దళితులను కూడగట్టి అందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌డిఒ చిన్నికృష్ణ

సచివాలయాలను తనిఖీ చేసిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని రాజాం, తైపురం సచివాలయాలను అనకాపల్లి ఆర్డీవో చిన్ని కృష్ణ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా భూ సర్వేపై వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా పనులు వేగవంత చేయాలని సూచించారు. కార్యక్రమం తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సంగీత దినోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో అనకాపల్లి శారద బ్రిడ్జి వద్ద గల ప్రముఖ పద సంకీర్తనాచార్యుడు తాళ్లపాక అన్నమాచార్యుని విగ్రహం వద్ద అంతర్జాతీయ సంగీత దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అన్నమయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ అన్నమయ్య వేంకటేశ్వరునిపై సుమారు 10 వేల కీర్తనలను రాసి తానే స్వయంగా పాడి ప్రముఖ సంగీత చరిత్రకారునిగా కీర్తి గడించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేశ్ గుప్తా, అల్లాడ శ్రీనివాసరావు, రొబ్బి మల్లేశ్వరరావు, పట్నాల కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

అన్నమయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆర్థిక అవగాహనపై క్విజ్ పోటీలు

ప్రజాశక్తి- అనకాపల్లి

జి20లో భాగంగా ఆర్‌బిఐ ఆదేశాల ప్రకారం విద్యార్థులలో ఆర్థిక చైతన్యం కలిగించేందుకు ఆర్థిక అవగాహనపై బుధవారం జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు లీడ్ బ్యాంకు మేనేజర్ కె.సత్యనారాయణ తెలిపారు. ప్రతి మండలంలో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5000, రూ.4000, రూ.3000 చొప్పున నగదు బహుమతి, సర్టిఫికెట్లు అందించినట్లు చెప్పారు.

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంగా 8, 9 తరగతుల విద్యార్థులకు యూనియన్ బ్యాంక్ సబ్బవరం శాఖ మేనేజర్ బిర్లంగి రాజారావు ఆధ్వర్యాన క్విచ్ పోటీలు నిర్వహించారు. మొత్తం 8 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుండి 16 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ప్రథమ స్థానం సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు బి.మొంషత, జి.భాగ్యశ్రీ, ద్వితీయ స్థానం నంగినారపాడు జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు బి.తేజేశ్వరి, ఎన్.విజయ, తృతీయ స్థానం జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు కె.రమ్య,డి. గౌతమి సాధించారు. వారికి మెరిట్ సర్టిఫికెట్లను, పాల్గొన్న విద్యార్థులకు పార్టిషిపేషన్ సర్టిఫికెట్లను బి. రాజారావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎస్.అప్పలరాజు, ఎంఇఒ-2 బిఎస్ఎన్.మూర్తి, ఇన్విజిలేటర్ అర్.ప్రసాద్, ఇన్‌ఛార్జి హెచ్ఎం సిహెచ్.చిన్నమ్మాయి పాల్గొన్నారు.

క్విజ్‌లో బహుమతులు పొందిన విద్యార్థులు

26 నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈనెల 26 నుంచి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించడానికి జిల్లా వ్యాప్తంగా ఇంటింటి ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం ఎల్సిడిసి క్యాంపెయిన్ కమిటీ సభ్యులు డిఎంహెచ్వో డాక్టర్ హేమంత్, డిస్టిక్ లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ ఆఫీసర్ శారదాబాయి, ఇతర కమిటీ మెంబర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 26 నుంచి జులై 16 వరకు ఇంటింట సర్వే చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. జిల్లాలో ప్రజలకు ఎవరైనా కుష్టి వ్యాధి లక్షణాలతో బాధపడుతూ ఉంటే ఇంటి వద్దకు ఆరోగ్య కార్యకర్తలు సర్వే చేయడానికి వచ్చినప్పుడు చూపించుకోవాలని సూచించారు. కేంద్ర ఆరోగ్య కార్యకర్త వద్ద ఎంపీడీ మందులు ఉంటాయని, అవసరమైన వారు వారి వద్ద ఉచితంగా తీసుకోవచ్చని తెలిపారు.

మాట్లాడుతున్న కలెక్టర్

ఈశ్వరరావును అభినందిస్తున్న పాల సంఘం సభ్యులు

పాల సంఘం అధ్యక్షునిగా ఈశ్వరరావు

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని పరవాడపాలెం గ్రామంలో విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్ష పదవికి బుధవారం జరిగిన ఎన్నికల్లో డొప్పా ఈశ్వరరావు విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో పరవాడ చిన్న రమణకు 34 ఓట్లు రాగా, ఈశ్వరరావుకు 45 ఓట్లు వచ్చాయి. 11 ఓట్లు మెజారిటీతో ఈశ్వరరావు అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎఎస్ఐ మణి కుమారి, సిబ్బంది మణి రాజు పర్యవేక్షించారు. అనంతరం ఈశ్వరరావును సన్మానించారు.

వినతిపత్రం ఇస్తున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు

సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం సక్రమంగా అందించాలని కోరుతూ బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అనకాపల్లి బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్వరి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అజయ్ బాబుకు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ హాస్టళ్లలో తాగునీరు, మరుగుదొడ్ల పరిశుభ్రత లేకపోవడం వలన విద్యార్థులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. విద్యార్థులకు న్యాయమైన భోజనం అందించాలని, చదువుకోవడానికి ఇబ్బంది లేకుండా చూడాలని, కోరారు. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సతీష్, గణేష్ పాల్గొన్నారు.

పిడుగుపాటు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని అంతకాపల్లి పంచాయతీ శివారు రావలమ్మ పాలెంలో సోమవారం తెల్లవారుజామున పిడుగుపాటుకు 18 మేకలు మృతి చెందగా, బాధితుడు సబ్బి రమణ కుటుంబానికి గ్రామానికి చెందిన యూత్ రూ.14 వేలు ఆర్థిక సహాయం బుధవారం అందజేశారు. ఆర్థిక సహాయం అందజేసిన వారిలో గండి వెంకట రమణ, గొంప లక్ష్మణ, పెన్నాం శ్రీను, లాలం అచ్చంనాయుడు, జక్కాన దేముడుబాబు, మేడపురెడ్డి అక్కునాయుడు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

ప్రజలకు సేవలందించడంలో ముందుండాలి

'జగనన్న సురక్ష' సమీక్షలో జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

చెరువు గట్టుపై కొబ్బరి మొక్కలు నాటుతున్న దృశ్యం

ప్రజాశక్తి- కె.కోటపాడు

ఈ నెల 23 నుండి జూలై 23 వరకు జరుగు జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ప్రజలకు సేవలు అందించాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి ఆదేశించారు. మండలంలోని సూదివలస గ్రామ సచివాలయంలో ప్రజాప్రతినిధులు, వాలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బందితో బుధవారం కలెక్టర్ సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చే ఎటువంటి సమస్యలైనా పరిష్కరించవలసి ఉంటుందన్నారు. ముఖ్యంగా కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ సభ్యుడు ధ్రువీకరణ పత్రం, మ్యుటేషన్ లావాదేవీలు, ఆధార్‌కు ఫోన్ నెంబర్ అనుసంధానం, పంట సాగు హక్కు కార్డు, రేషన్ కార్డు విభజన, కుటుంబ సర్వే విభజన మొదలైన వాటిని పరిష్కరించాల్సి ఉంటుందని చెప్పారు. మండల వ్యాప్తంగా రెండు టీములు పర్యటిస్తాయని, సచివాలయ పరిధిలో ఏ తేదీన ఆయా టీములు పర్యటిస్తాయో ముందుగా సమాచారం అందిస్తారని తెలిపారు. అనంతరం సచివాలయ ఉద్యోగుల పనితీరును, వారి రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామంలో కొత్తచెరువు సుందరీకరణ పనులను పరిశీలించారు. చెరువు చుట్టూ గట్టు వెంబడి 200 కొబ్బరి మొక్కలను నాటారు. పంచాయతీ ఆధ్వర్యంలో సిమెంటు బల్లలు ఏర్పాటు చేయాలని సర్పంచ్ ఆదిరెడ్డి సన్యాసి నాయుడును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వర్రి రామునాయుడు, మండల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, తహశీల్దారు రమేష్ బాబు, ఎంపీడీవో శచీదేవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై శిక్షణ

పరవాడ : మండలంలోని వెన్నెలపాలెం ఏపీ కళ్యాణ మండపంలో మండల అన్ని పంచాయతీల గ్రామ వాలంటీర్లు, గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమం బుధవారం జడ్పీటీసీ పైలా రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. వాలంటర్లు ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కావలసిన పత్రాలను వారి కుటుంబంలో నుండి రిక్వెస్ట్లు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హేమ సుందర్‌రావు, వైస్ ఎంపిపి బి.నాగేశ్వరరావు, తహశీల్దార్ కనకరావు, మండల కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని కృష్ణదేవిపేట సచివాలయంలో ఆర్డీవో హెచ్‌వి.జయరాం అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా పాతకృష్ణదేవిపేట గ్రామ పంచాయతీని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని జగనన్న సురక్ష కార్యక్రమం విధివిధానాలు తెలియజేశారు. కుల, ఆదాయ, జనన, మరణ ధృవపత్రాలు తదితర సేవలను సచివాలయంలో వినియోగించు కోవాలన్నారు. మండల ప్రత్యేక అధికారి మోహన్‌రావు మాట్లాడుతూ, గ్రామ సచివాలయంలో గ్రీవెన్స్ పెట్టి సర్టిఫికెట్లు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహశీల్దార్ ఆనందరావు,

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి రాజు

అవగాహన కల్పిస్తున్న నర్సీపట్నం ఆర్‌డిఒ జయరాం

ఈఓపిఆర్‌డి రఘురాం, ఎంపిడిఒ డేవిడ్‌రాజు, సెక్రటరీ కిరణ్మయి పాల్గొన్నారు.

నక్కపల్లి : వచ్చే నెల ఒకటవ తేదీ నుండి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ అంబేద్కర్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయం లో సమావేశం నిర్వహించారు. ఇంటింటికి చేపట్టే సర్వేలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగానే రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిటి నీరజ పాల్గొన్నారు.

కోటవురట్ల : జగనన్న సురక్ష పథకాన్ని దిగ్విజయంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి అరుణశ్రీ, తహసీల్దార్ జానకమ్మ, ఎంపీడీవో కాశి విశ్వనాథరావు కోరారు. పైలట్ ప్రాజెక్టు గ్రామమైన కైలాసపట్నం సచివాలయంలో సమావేశం నిర్వహించారు. గ్రామంలో పలువురు వివిధ ధ్రువపత్రాలకు దరఖాస్తులు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.విచారణ చేపట్టి త్వరితగతిన ధ్రువపత్రాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నూకరత్నం, డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్, ఏవో చంద్రశేఖర్, ఈఓపిఆర్‌డి సుబ్రహ్మణ్యం, సచివాలయం సిబ్బంది గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

మాడుగుల : జగనన్న సురక్షపై మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మీనా కుమారి మాట్లాడుతూ, 12 రకాల ధ్రువపత్రాలు అందించేందుకు వాలంటీర్ల సర్వే చేపట్టాలన్నారు. ధ్రువ పత్రాలు నేరుగా అందించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిపి సత్యనారాయణ ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు

సరైన శిక్షణ ఇస్తే అద్భుతాలు సృష్టిస్తారు

సర్టిఫికెట్లు అందజేస్తున్న సూర్యనారాయణ

ప్రజాశక్తి -అనకాపల్లి

విద్యార్థులలో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకతను గమనించి వారికి సరైన శిక్షణ ఇస్తే అద్భుతాలు సృష్టిస్తారని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి, జాతీయ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కంచరాన సూర్యనారాయణ అన్నారు. జివిఎంసి ఆధ్వర్యాన స్థానిక జార్జ్ క్లబ్ జిమ్‌లో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన విద్యార్థులకు బుధవారం సూర్యనారాయణ చేతులు మీదుగా బుధవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. టీ షర్టులు అందజేశారు. ఈ శిబిరంలో శిక్షణ ఇచ్చిన ఎంఎన్ఎస్.అప్పారావును అభినందించారు. ఈ శిబిరం మే 22 నుండి జూన్ 4వ తేదీ వరకు జరిగింది. 40 మంది విద్యార్థులకు ఎంఎన్ఎస్.అప్పారావు ఆధ్వర్యంలో వెయిట్ లిఫ్టింగ్ క్రీడలో శిక్షణ ఇచ్చారు. 40 మందిలో పది మంది బాలికలు కావడం విశేషం. జార్జ్ క్లబ్ కమిటీ ఈ శిబిరానికి సహాయ సహకారాలు అందించింది. ఈ సందర్భంగా కంచరాన సూర్యనారాయణ, జాతీయ వాలీబాల్ రిఫరీ రాపేటి సీతారాము, వెట్రన్ క్రీడాకారుడు కెప్టెన్ అప్పారావులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జార్జ్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బుద్ధ కాశీ విశ్వనాథం, మళ్ల చంద్రశేఖర్, దాడి బుజ్జి, బొద్దేడ శేషు, పోలారపు త్రినాధరావు, డాక్టర్ డిడి నాయుడు, ఆదారి శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

900 బిఎస్ఎన్ఎల్ 4జి టవర్లు

ప్రజాశక్తి -సీలేరు : అల్లూరి సీతారామరాజు జిల్లాలో 900 బిఎస్ఎన్ఎల్ 4జి టవర్లు ఏర్పాటు చేయడానికి ప్రక్రియ పూర్తి చేశామని బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ పాల్ విలియమ్ వెల్లడించారు. బుధవారం సీలేరులో విస్తృతంగా పర్యటించి ఆయన బిఎస్ఎన్ఎల్ టవర్లు సిగ్నల్ పనితీరు తదితర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో బోర్డులు తదితర సామాగ్రిని పరిశీలించారు. వినియోగదారులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నెట్వర్క్ నిరంతరం ఉండేలా చర్యలు చేపట్టాలని డిఈ రాజకుమార్ ఆదేశించారు. నెట్వర్క్ లో సాంకేతిక పరమైన సమస్యల్ని సిబ్బందిని అడిగి ఆరా తీశారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ టవర్లు ఏర్పాటుకు బేస్మెంట్ లెవల్ పనులు కూడా ప్రారంభించామన్నారు. ఈ ఏడాది డిసెంబర్ కల్లా 4జి టవర్లు 500 పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. ప్రస్తుతం ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న 3జి టవర్లను 4జిగా మార్చడానికి అన్ని చర్యలు చేపట్టేమన్నారు. ఫైబర్ నెట్వర్క్ సేవలు మరింత విస్తృతం చేస్తున్నామని తెలిపారు. అల్లూరి జిల్లాలో 1700కు పైగా వినియోగదారులకు ఫైబర్ నెట్ కనెక్షన్ ఇవ్వడం జరిగిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ డిఈ రాజ్ కుమార్ ఎఇఇ. భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి బస్సు యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- మునగపాక రూరల్

ఎలమంచిలి నియోజకవర్గంలో ఈనెల 23న నిర్వహించ తలపెట్టిన బస్సు యాత్రను విజయవంతం చేయాలని తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి ముసిలి నాయుడు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 23న సాయంత్రం మండల కేంద్రం మునగపాకకు యాత్ర చేరుకుంటుందని, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు నాయకులు దొడ్డి రమేష్, జెకె నాయుడు, వెలగా మురళి, బొద్దేడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు ముసిలినాయుడు

3న గురుపౌర్ణమి ఉత్సవాలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక షిరిడి సాయి మందిరంలో జూలై 3న గురు పౌర్ణమి సందర్భంగా మహోత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని షిరిడి సాయి సేవా సమాజ్ అధ్యక్షుడు కర్రి రామ్ గోపాల్ వెల్లడించారు. బుధవారం ఏర్పాట్లపై కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం సేవా సమాజ్ అధ్యక్షుడు రామ్ గోపాల్ మాట్లాడుతూ, జూలై 3న కాగడా హారతి, నిత్య పూజ, హోమం, అభిషేకములు వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. అనంతరం అన్న సమారాధన నిర్వహిస్తా న్నారు. సాయంత్రం పల్లకి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. షిరిడి సాయి మందిరంలో మండప నిర్మాణంకు విరాళాలు అందించవచ్చని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సేవా సమాజ్ కార్యదర్శి వి రామచంద్ర రాజు, ట్రెజరర్ లంక ఈశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

పోరాటంతోనే రోడ్డు సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-గొలుగొండ:జనసేన పార్టీ పోరాట ఫలితంగానే ఆరిలోవ అటవీ ప్రాంత రోడ్డు సమస్య పరిష్కారం అయ్యిందని ఆ పార్టీ గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, నాయకులు రేగుబళ్ల శివ, సాలాదుల ప్రసాద్ అన్నారు. తమ పార్టీ నియోజకవర్గ నాయకులు రాజాన సూర్యచంద్ర ఆర్డీవో కార్యాలయం ముందు రెండు రోజుల పాటు నిరవధిక నిరాహారదీక్షకు పూనుకున్నారన్నారు. అలాగే పాదయాత్ర చేపట్టడం జరిగిందన్నారు. దీంతోనే రోడ్డు సమస్య ఒక కొలిక్కి వస్తే.. ఇప్పుడు తామే చేశామంటూ వైసిపి నాయకులు చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు బోయిన చిరంజీవి, లింగంపేట ఉప సర్పంచ్ లంక సత్యనారాయణ, వెంకటేష్ పాల్గొన్నారు.

క్వారీని నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి -రావికమతం:మండలంలో కవగుంట గ్రామపంచాయతీ పట్టాలమ్మ తల్లి గుడి సమీపంలో క్వారీ బ్లాస్టింగులతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రావికమతం నుంచి ఘాటి రోడ్డుకు వెళ్లే రోడ్డు మార్గం సమీపంలో ఈ క్వారీ ఉండటంతో బ్లాస్టింగ్ రాళ్లు తమపై పడతాయోనని పాదచారులు, వాహన చోదకులు భయబ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. క్వారీ దుమ్ము ధూళితో పంటలు సర్వనాశనం అవుతున్నాయని పేర్కొన్నారు. బ్లాస్టింగ్‌తో కవగుంట గ్రామ ఇల్లులు బీటలు బారుతు న్నాయన్నారు. ఈ ప్రాంతంలో మూగజీవులకు మేత దొరకని పరిస్థితి నెలకొందన్నారు.

విరాళం అందిస్తున్న ప్రసాదరావు

జాతరకు 'పైలా' విరాళం

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని తాటిపర్తి పంచాయతీ చిన్న కూర్మనాథపురం గ్రామంలో నిర్వహిస్తున్న మోదమాంబ జాతరకు టిడిపి నేత పైలా ప్రసాదరావు పది వేల రూపాయల విరాళం అందించారు. గ్రామానికి చేరుకుని అమ్మవారిని దర్శించి అనంతరం నగదును నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వంతల అప్పారావు, ఆళ్ళంగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో రిజిస్ట్రేషన్లకు ఆటంకం

ప్రజాశక్తి-నక్కపల్లి:సాంకేతికంగా లోపంతో ఈ కేవైసీ కాక పోవడంతో క్రయవిక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయంలో బుధవారం భూములు, ఇంటి స్థలాలు, తదితర స్థలాల రిజిస్ట్రేషన్‌కు అధిక సంఖ్యలో క్రయవిక్రయదారులు సబ్ రిజిస్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. సాంకేతిక లోపం కారణంగా సాయంత్రం 3.30 గంటల వరకు ఈ కేవైసీ నమోదు కాకపోవడంతో రిజిస్ట్రేషన్లు నిలిచి పోయాయి. ఆ తర్వాత ఒక గంట పని చేసి మరలా సాంకేతిక లోపం తలెత్తడంతో రిజిస్ట్రేషన్లు ఆగి పోయాయి. క్రయ విక్రయదారులు గంటల కొద్దీ క్యూ లైన్‌లో నిలబడి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రిజిస్ట్రేషన్లకు కార్యాలయం వద్ద పడిగాపులు గాచారు. తరచూ ఇటువంటి సమస్యలు తలెత్తుతుంటే రిజిస్ట్రేషన్లు ఎలా చేయించుకోవాలని క్రయవిక్రయదారులు ఆవేదన చెందుతున్నారు.

కార్యాలయంలో క్యూలో ఉన్న క్రయవిక్రయదారులు

ఇసుక, మట్టి అక్రమ రవాణాపై నిఘా

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో అక్రమంగా ఇసుక, మట్టి రవాణా చేసే వారిపై ఉక్కు పాదం మోపాలని తహసిల్దార్ జానకమ్మ తెలిపారు. బుధవారం రెవెన్యూ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల నుండి మట్టి, ఇసుక అక్రమంగా రవాణా అవుతున్న విషయం పలు గ్రామాల నుండి ఫోన్ల ద్వారా ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. అక్రమంగా రవాణా జరుగుతున్న గ్రామాలలో నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అవసరమైతే పోలీసుల సహకారం తీసు కోవాలన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి విజయవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటికే వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సకాలంలో అందజేయాలన్నారు. సర్వే నిర్వహిస్తున్న గ్రామాల పట్ల రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఉర్దవరావు, సీనియర్ జూనియర్ అసిస్టెంట్లు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందితో సమావేశం

ప్రజాశక్తి -కోటవురట్ల: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబ్ కార్డుదారులందరికీ వంద రోజులు పని కల్పించాలని ఎంపిడివో కాశి విశ్వనాథరావు ఆదేశించారు. బుధవారం ఉపాధి హామీ సమావేశ మందిరంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికి 272 రూపాయలు వేతనం అందే విధంగా పనులు కల్పించాలన్నారు. ఉద్యానవన పనులతో పాటు ఫిట్టింగు ప్లాంటింగ్ పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఉపాధి పనుల వద్ద ఎటువంటి అసౌకర్యం కలగకుండా కూలీలకు అన్ని వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ గంగు నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్యాధికారులు

కుష్టు వ్యాధిపై సర్వే

ప్రజాశక్తి-మాడుగుల: కుష్టు వ్యాధి నిర్మూలనకు ఇంటింటి సర్వే సమగ్రంగా చేపట్టాలని కేజే పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ప్రసాద పాత్రుడు, లీలా ప్రసాద్ సూచించారు. ఈ నెల 26 నుండి జూలై 16వ తేదీ వరకు జరగనున్న సర్వేలో ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కుష్టి వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి నివేదిక అందజేయాలని కోరారు. దీనికి సంబంధించిన కరపత్రాలు ఆశా కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త వరి విత్తనాలు వేసుకోవాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:రైతులు ప్రత్యామ్నాయంగా కొత్త రకాలు వరి విత్తనాలు వేసుకోవాలని వ్యవసాయ అధికారి ఉమాప్రసాద్ సూచించారు. మండలంలోని బుధవారం కాగిత, గుల్లిపాడు రైతు భరోసా కేంద్రాలను క్షేత్ర పర్యటన చేశారు. వరిలో విత్తన శుద్ధి ఆవశ్యకతను రైతులకు వివరించారు. విత్తన శుద్ధితో తెగుళ్ల బారి నుండి రక్షించవచ్చునన్నారు. వరిలో కొత్త రకాలైన స్వర్ణకి ప్రత్యామ్నాయంగా ఎంటియు 1318, సాంబకి ఎంటి యు 1224, ఆర్‌జిఎల్ కి ఎంటియు 1061 (ఇంద్ర), ఎంటియు 1064 (అమర) వంటి కొత్త రకాలను రైతులు ఎంచుకోవాలన్నారు. వీటితో తెగుళ్ళ, చీడలు నియంత్రణ ఖర్చులు తగ్గడం తో పాటు అధిక దిగుబడులు పొందవచ్చునని అన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎఒ

ఎల్‌పురంలో అపారిశుధ్యం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో పారిశుద్యం అధ్వాన్నంగా తయారైంది. గ్రామంలోని వీధుల్లో చెత్త కుప్పలు, కాలువల్లో మురుగునీరు రోడ్డుపై ప్రవహించడంతో దుర్గంధం వెదజల్లుతుంది. ముఖ్యంగా బిసి కాలనీ, వినాయక వీధి, గొల్లపేట, ఎస్సీ కాలనీ

బిసి కాలనీలో అధ్వాన్నంగా ఉన్న మురుగునీరు

ఎస్సీ కాలనీలో ప్రవహిస్తున్న మురుగునీరు

తదితర ఏ వీధి చూసినా డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా ఉంది. చెత్త కుప్పలు రోడ్డుకు ఇరువైపులా దర్శనమిస్తున్నాయి. దీంతో, గ్రామంలో మురుగునీరు ఎటుపోలేని దుస్థితి నెలకొంది. రహదారులు, ఇంటి ముందు కాలువల్లో మురుగునీరు నిల్వలు ఉండిపోయి దుర్వాసన వస్తోంది. దీంతో దోమల బెడద విపరీతంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో చెత్తను, కాలువల్లో పూడికను తొలగించాలని కోరుతున్నారు.

మాట్లాడుతున్న ఆర్డీవో

ఓటు హక్కు నమోదు చేయాలి

ఆర్డీవో జయరాం

ప్రజాశక్తి-గొలుగొండ:18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు నమోదు చేయాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బిఎల్‌వోల సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ, బిఎల్‌వోలు తమ పరిధిలో ఉన్న ఓటర్ జాబితాను సరి చూసుకుని జనాభా పరిమితిలో ఓట్లు ఉన్నవి లేనివి పరిశీలించాలన్నారు. డెత్‌లను, డబల్ ఎంట్రీలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి. ఆనందరావు, బిఎల్ఓలు పాల్గొన్నారు.

యంత్రాన్ని పంపిణీ చేస్తున్న జెడ్‌పిటిసి

యంత్రాల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని చీడిగుమ్మల పంచాయతీ సచివాలయంలో ప్రధానమంత్రి కృషి సించాయీయోజన (పిఎంకెఎస్‌ఎన్) స్కీము ద్వారా బ్యాటరీ స్ప్రేర్ మిషన్లు, తారపాలు, నీటి ఇంజనీర్ మిషన్లను బుధవారం చీడిగుమ్మల, పాకలపాడు, గుండుపాలకు చెందిన రైతులకు జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుండుపాల ఎంపిటిసి కొరుప్రోలు సత్యనారాయణ, చీడిగుమ్మల సర్పంచ్ కాపారావు చిన్నబ్బాయి, ఉప సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ, వైయస్సార్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పత్తి రమణ పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందులు

ప్రజాశక్తి -చీడికాడ:గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు చీడికాడ పశు వైద్య అధికారిని జి.గాయత్రి దేవి తెలిపారు. మండలంలోని అడవుల అగ్రహారం గ్రామంలో సుమారు 5 వేలు మూగ జీవాలకు ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేశామన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఈ నెలాఖరు వరకు జరుగుతుందని, గొర్రెలు, మేకలు పెంపకందారులు గ్రామ రైతు భరోసా కేంద్రంలోని పశు సంవర్ధక సహాయకులను సంప్రదించి ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక సహాయకులు, గంగు నాయుడు పాల్గొన్నారు.

మందులు వేస్తున్న పశువైద్యాధికారి

24న టిడిపి సమావేశం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కొత్తజోగుంపేట గ్రామంలో ఈ నెల 24న తెలుగుదేశం పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తామని ఆ పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు తెలిపారు. చంద్రబాబు నాయుడు చేపడుతున్న మీ భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సు యాత్ర ఈనెల 24న నర్సీపట్నం నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందని, దీనిపై చర్చించడానికి సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

నేడు రోడ్డు విస్తరణ పనులు

ప్రజాశక్తి-గొలుగొండ:ఈ నెల 22న ఉదయం 8:30 గంటలకి గొలుగొండ మండలం ఆరిలోవ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తామని వైసిపి మండల అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ హాజరవుతారన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

కౌలు పత్రాలతో ప్రయోజనం

ప్రజాశక్తి -చీడికాడ:మండలంలోని జైతివరం గ్రామంలో కౌలు రైతులకు మండల వ్యవసాయ అధికారిని ఏ.కృష్ణవేణి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భూమి లేని కౌలు రైతులకు ప్రభుత్వం కౌలు పత్రములను ఇస్తున్నట్లు తెలిపారు. పంటకు గిట్టుబాటు ధర తోపాటు, రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులను పొందుటకు ఈ కౌలు పత్రము ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి కే.గౌరీ శంకర్, గ్రామ ఉద్యాన సహాయకులు, గ్రామ పశు సంవర్ధక సహాయకులు మార్తా శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఒ

సత్యవతికి ఘన నివాళి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ తల్లి సత్యవతికి పలువురు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బుధవారం ఇంటి వద్ద సత్యవతి సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎంవివి.ప్రసాద్‌లు సత్యవతి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ, టిడిపి పార్టీకి ఆదపురెడ్డి కుటుంబం ఎంతో సేవ చేశారని, పార్టీ పరంగా వ్యక్తిగతంగా వారికి పూర్తిస్థాయిలో అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం జడ్పిటీసి సుకల రమణమ్మ, కొయ్యూరు మాజీ జెడ్పిటిసి గాడి శ్రీరామ్మూర్తి, గొలుగొండ మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, అయ్యన్న యువసేన అధ్యక్షులు, నర్సీపట్నం కౌన్సిలర్ చింతకాయల రాజేష్‌లతో పాటుగా పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సత్యవతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

నివాళులర్పిస్తున్న ఎంవివి.ప్రసాద్

కొండవాలులో సహాయక చర్యలు

ప్రజాశక్తి- సీతమ్మధార: రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి ఇళ్లల్లోకి మట్టి, వర్షపు నీరు చొరబడిన 48వ వార్డు శ్రీనివాస్ నగర్, బాపూజీ నగర్, జై భారత్ నగర్, ఇందిరానగర్ -1,3,5 ప్రాంతాలలో స్థానిక వార్డు కార్పొరేటర్, జివిఎంసిలో బిజెపి ఫ్లోర్‌లీడర్ గంకల కవిత అప్పారావు బుధవారం సందర్శించారు. సమస్య తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారమిచ్చి, సంఘటనాస్థలికి చేరుకుని, బాధితులతో మాట్లాడి వారి కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రౌండ్‌ది క్లాక్ మంచినీటి సరఫరాకు పైపులైన్ వేసేందుకు తవ్విన గోతుల వల్ల, వర్షం కురిసినప్పుడు కొండవాలు ప్రాంతంలోని నీరంతా ఇళ్లల్లోకి చొరబడిందని, మట్టిపేరుకుపోవడంతో ఆయా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు.

ప్రయివేటు పాఠశాలలకు ప్రభుత్వ గుర్తింపు ఉండాలి

-ఎంఇఒలు చిట్టిబాబు, సూర్యనారాయణమూర్తి

ప్రజాశక్తి -కశింకోట : ప్రయివేటు పాఠశాలలు ప్రభుత్వ గుర్తింపు పొంది ఉండాలని కశింకోట మండల విద్యాశాఖ అధికారులు చిట్టిబాబు, సూర్యనారాయణమూర్తి చెప్పారు. ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ, ప్రతి తరగతిలో పరిమితంగా విద్యార్థులను ఉంచాలన్నారు. ప్లేగ్రౌండ్, ఆహ్లాదకర వాతావరణం ఉండాలని, పిల్లలకు ఒత్తిడి లేని విద్యనందించాలని చెప్పారు. అర్హత గల ఉపాధ్యాయులను నియమించుకోవాలన్నారు. రహదారి సౌకర్యం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన సెలవు దినాల్లో తరగతులు నిర్వహించరాదని చెప్పారు. విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులతో మాట్లాడుతూ, సరైన దిశానిర్దేశం చేస్తుండాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు వసూలు చేయాలని చెప్పారు. నిబంధనలు పాటిస్తూ పాఠశాలలను నడపాలని సూచించారు.

మాట్లాడుతున్న ఎంఇఒలు చిట్టిబాబు, సూర్యనారాయణమూర్తి